# ఈ కోయిల ఇక పాడదు

## 'రాయంచ'

అద్భుతమైన కోయిల పాటన్నా... అందమైన పూల తోటన్నా... గల గల పారే సెలయేరన్నా... గగనంలో విరిసే పున్నమి రేయన్నా చాలా ఇష్టం నాకు. వీటిలో ఏది అనుభవానికి వచ్చినా జీవితాంతం ఆ అనుభూతుల మధ్య అలాగే ఉండిపోవా లనిపిస్తుంది నాకు... అలాంటి అనుభూతుల మధ్య గడిపే అదృష్టం మాత్రం దక్కలేదు. ఆ అదృష్టం నాకు కలగకుండా చేసిన శక్తులు చాలా ఉన్నాయి.

నాన్న లేని నేను.... అమ్మ కూడా నాకు లేకుండా పోయే వరకూ గడిపిన ఆ ఊరు ఓ అందమైన పల్లెటూరే. ఎటు చూసినా ప్రకృతి పులకరింతల మధ్య పునీతమయ్యే ఆ ఊరికి ఓ అందమైన సెలయే రుండేది... ఆ ప్రక్కనే అందమైన పూల తోట లుండేవి.... చైత్ర మాసపు వెన్నెల్లో... ఆ సెలయేటి ఒడ్డున ఆ పూల తోటల మధ్య.... కోయిల పాటలు వింటూ పరవశించిపోయేవాడ్ని. ఆ సెలయేటి గలగలలు వింటూ నన్ను నేను మర్చిపోయేవాడ్ని. కొన్ని కొన్ని రాత్రులా తోటలోనే ఉండిపోయేవాడ్ని కూడా. మొదట్లో అమ్మ చాలా కంగారు పడి ఏడ్చేది. తరువాత అలవాటు పడిపోయింది. జీవితం విలువల గురించీ.... బ్రతుకు పయనంలోని ఒడుదుడుకుల గురించీ అప్పట్లో అంతగా తెలియని నేను... ఆ అనుభూతుల్లే శాశ్వతం అనుకునే వాడ్ని.

కాని అమ్మ చనిపోయాక.... వాస్తవాలతో రాజీ పడ్డం కోసం... బ్రతుకు పోరాటం కోసం... ఆ ఊరిని వదిలి పెట్టడం తప్పని సరైంది. మసక బారిన కళ్ళతో... నేను గడిపిన మధురమైన క్షణాల్ని... నా గుండె గదిలో పదిల పరచుకుంటూ... బరువెక్కిన గుండెతో ఆ ఊరిని విడిచి పెట్టాను.

అంతే... ఆ తరువాత బ్రతుకు పోరాటంలో జీవితం యాంత్రికమై పోయింది. కాలగర్భంలో చాల రోజులు కలిసిపోయాయి. చాలా సార్లు ప్రయత్నించాను నేను వదలి వచ్చిన ఊరు వెళ్ళినా అనుభవాలను మళ్ళీ నెమరు వేసుకోవాలని.... కాని అవకాశం కుదరలేదు. తరువాత ఎప్పటికో అవకాశం కుదిరే నాటికి... నాగరికత ప్రభావంతో ఆ ఊరు చాలా మారిపోయిందని తెలిసింది. మరిక వెళ్ళాల నిపించలేదు నాకు. అంతే ఆ తరువాత నా బ్రతుకులో రసాత్మక ఘడియలూ... నా మనను అద్భుతమైన అనుభూతుల మధ్య డోల లూగిన సమయాలూ చాల తక్కువ



సరిగ్గా అలాంటి సమయంలో.....

ఎడారిలో ఒయాసిస్సులా... బాటసారికి దొరికిన విశ్రాంతి గృహంలా.... నా గుండె గదిలోని అనుభూతుల వీణాతంత్రులను మీటి.... అపూర్వమైన రాగాలను పలికించే.... అరుదైన అవకాశం.... నేను కొత్తగా దిగిన ఆ ఇంటి ఎదురుగా ఉన్న రెండంతస్తుల మేడపై పోర్షను కిటికీ లోంచి.

గాలికి గంధాలను అపాదిస్తూ.... ప్రకృతికి పులకింతల మొగ్గలను తొడుగుతూ..... పిల్ల తెమ్మెరలా... చల్లగా కురుస్తున్న వెన్నెలలా... మృదుమధురంగా... మధుర మనోహరంగా... కర్ణపుటాలను కమనీయంగా సోకుతూ వినిపించింది ఓ పాట...

జీవం గల పాట... జీవించే పాట.

అద్భుతమైన ఆలాపనతో... అనన్య సామాన్యమైన ప్రతిభతో ఎవరో స్త్రీ మూర్తి పాడుతోన్న పాట.

నాకు ఒక్కసారిగా నేను ఒదిలేసిన మా ఊరు... సెలయేరు... తోటలూ కోయిల పాటా గుర్తొచ్చాయి. నేను స్వేచ్ఛా విహంగంలా తిరిగిన అప్పటి రోజులు నా కళ్ళ ముందు ఒకదాని వెంట ఒకటి సజీవ దృశ్యాల్లా మెదిలాయి.

నాకు తెలీకుండానే.... నాలో కలిగిన రసోద్రేకానికి ప్రతీకగా.... నా కను కొల కుల్లో నిలిచిన నీటి బిందువులు. నాకు తెలీకుండానే నా శరీరంలోని అణువణువునూ పులకింప చేస్తూ..... చిత్రమైన ప్రకంపనలు.....

ఎక్కడి నుంచీ అద్భుతమైన స్వరధార.

ఎదురింటి పై అంతస్థులోని కిటికీ లోంచేనా... అటు వైపు చూశాను. సన్నగా... చిన్నగా... వెన్నెలతో కలిసి కురుస్తున్న మంచు బిందువుల్ని 'ఫేడౌట్' చేస్తున్న అద్భుతమైన ఆ ఉషోదయపు వేళ..

ఆ తొలి సంధ్యా ప్రాంగణంలో.... ప్రకృతికి మేలు కొలుపు పాడుతోన్న భూపాల రాగం....

పల్లవిని తనలో పల్లవించుకుంటూ సాగి వచ్చిన పిల్లగాలి. నన్ను చుట్టు ముట్టి ఉక్కిరి బిక్కిరి చేసిన ఫీలింగ్ నాలో...

''మధుర మానపు కోయిలా... పాడవే రాగం
నీ తీయని గొంతులో.... పలకనీ గీతం
పూచింది ఈ ఆమని పూల తేనెలతో
వేచింది నీ రాకకు చిగురు మావులతో
సెలయేటి గలగలలే - నీ పాటకు సరిగమలని
చిరుగాలి చెప్పేనమ్మ... సిరిమల్లె నవ్వేనమ్మ....''

అలలు... అలలుగా ఆమె అద్భుతమైన గొంతులోంచి జాలు వారిన పల్లవి నన్నేవేవో లోకాలలో విహరింప చేసింది.

శిలలను సైతం కరిగింప చేసే.... అలలను సైతం స్తంభింప చేసే గంధర్వ గానాన్ని ఆలపించే ఆ మూర్తి కోసం కన్నులు విప్పార్చుకుని ఆ కిటికీ వైపు చూశాను - ఆ మసక వెలుతులో.

ఊహూ.... అక్కడెవరూ కనపడలేదు నాకు. కానీ ఆ పాట ఇంకా అలా మంద్రంగా... మధురంగా జాలువారుతూనే ఉంది కిటికీ లోంచి. ఆ పాటతో పాటుగా ఏవేవో లోకాలలో విహరించి... డోలలూగిన నేను... అయిదు నిముషాల తర్వాత పాట ఆగిపోవడంతో ఈ లోకానికి వచ్చాను.

అప్పుడే అయిపోయిందా?! అమృతపు ధార.

మరో పది నిముషాలు అలా కిటికీ వేపు చూస్తూ... నా కిటికీని అంటిపెట్టుకుని ఉండిపోయాను చెవులు రిక్కించుకుని.

ఊహూ.... నాకు మరో పాట వినే అదృష్టం కలగలేదిక. అయినా మేల్కొనే అలవాటు నా కారోజు చాలా అదృష్టాన్ని ప్రసాదించింది.

నాకు తెలియకుండానే నా మనసులో కలిగే అలజడిని తగ్గించే రసానందం.... ఎన్నాళ్ళుగానో నాకు తెలియకుండానే నేను కోరుకుంటున్న అనుభూతి... ఇదేనా?!

ఇక ఈ రోజంతా నేను చాల ఆనందంగా ఉండగలను.

నిస్సారవంతమైన ఈ 'రొటీన్ లైఫ్'ని మరి కొన్నాళ్ళు.... ఈ నెమరు వేతలో గడిపెయ్యగలను.....

శిశుర్వేత్తి.... పశుర్వేత్తి.... వేత్తి గానరసం ఫణిః ....

కాని ఎవరామె?.... ఆ విమల గానాన్ని వినే అవకాశం మళ్ళీ కలుగుతుందా?..... ఆమె ప్రతి రోజూ అలా పాడుతుందా? .....

ఇవన్నీ నాలో ఉదయించిన బేతాళ ప్రశ్నలు. వీటికి జవాబులు నాకంత అవసరం కాకపోయినా.... నాలో ఏ మూలో తెల్సుకోవాలనే ఉత్సుకత.

గబగబ తయారై క్రిందకు దిగాను. ఇంటి ఓనరు క్రిందనే ఉన్నాడు.

''మాష్టారూ!'' పిలిచాను.

నా వేపు చూశాడాయన... ''రండి... రండి.... ఎలా ఉంది గది... సామాన్లన్నీ సర్దేసుకున్నారా? - అడిగా డాయన.

''సర్దేశానండీ''

''ఒక్క రాత్రిలోనే సర్దేశారా?'' - ఆశ్చర్యంగా చూశాడాయన. చిన్నగా నవ్వాను నేను - ''బ్రహ్మచారిని కదండీ... పెద్దగా సామా న్లేముంటాయి'' - ఒక్క క్షణమాగి అడిగాను.

-''ఒక చిన్న ప్రశ్న''

''అడగండి'' - నా వేపు చూస్తూ అన్నా డాయన.

''ఈ రోజు వేకువ జామున ఎదురించి కిటికీలోంచి ఓ అద్భుతమైన గొంతులోంచి విన్పించిన పాట-''

నా ప్రశ్న పూర్తి కాకుండానే ఆయన అందుకున్నాడు'' - ఆమె ఎవరో.... ఎలా ఉంటుందో మాకు తెలీదు... సుమారు నెల రోజుల క్రితం ఆ ఇంట్లో దిగారు వాళ్ళు... ఆమెకు ప్రతి రోజూ వేకువ జామున, సంధ్యా సమయంలో పాడడం ఇష్టమనుకుంటాను. ప్రతి రోజూ పాడుతుంది. నాకూ ఆ పాటలంటే చాలాఇష్టం'' - చెప్పడం పూర్తి చేశా డాయన.

అంటే... అంటే... ఆమె సాయంత్రం కూడా పాడుతుందా? అంటే సాయంత్రం కూడా ఆ మధుర గానాన్ని వినవచ్చన్న మాట. ఆనందం ఉప్పెనలా ముప్పిరి గొనగా... వీధిలోకి నడిచాను.

సాయంత్రం ఆఫీసు నుండి త్వరగా ఇంటికి రావాలి.... అయినా చాన్నాళ్ళ తర్వాత ఎంతటి అదృష్టం?! ఓహ్!!

పగలంతా నిముషాలు... సెకన్లు లెక్కపెడ్తూ... సాయంత్రం ఆఫీసు వదలగానే తిన్నగా ఇంటికి వచ్చి.... ఆ కిటికీ ఎదురుగా ఉండే నా గది కిటికీ దగ్గర కూర్చున్నాను.

సూర్యుడు పడమటి కొండల్లోకి జారిపోతున్న మలి సంధ్య వేళ. పల్లెటూర్లో అయితే ఆలమందలు ఇంటికి తిరిగి వచ్చే గోధూళి వేళ...

ప్రముఖ చిత్రకారుడు అనన్య సామాన్యమైన ప్రతిభతో తీర్చిదిద్దిన వర్ణచిత్రంలా ఉంది పడమటి ఆకాశం.... ఆ సిందూర వర్ణాలలో రెక్క లల్లార్చుతూ... గాలిని చీల్చుకుంటూ నెమ్మదిగా ముందుకు సాగిపోయే పక్షులు... ఎక్కడో బహుదూర తీరాలలో కొండల్ని ముద్దాడుతున్న ఆకాశం... ఆ దృశ్యాన్ని కిటికీలోంచి చూస్తూ మమైకం చెందిన నాకు.... లీలగా గాలిలో తేలుతూ... నేను క్షణాలు యుగాలుగా లెక్కపెడుతూ ఎదురు చూస్తున్న నిరీక్షణ ఫలితం.....

సన్నజాజుల సంపెంగల పరిమళం... కలగలిసి నిలువెల్లా నను ఆవహిస్తున్నట్లుగా... తీయని... హాయైన పాట....

ఆ కిటికీ లోంచి... ఆమె పాడుతున్న పాట.

''అంతులేని పయనమెటు
అలసి ఉన్న బాటసారి
ఆగి ఒక నిముషమిచట



## కృతజ్ఞతలు

మంత్రిగారి ఉపన్యాసానికి జనం ఆవేశంతో చెప్పులు స్టేజీపైకి విసిరారు. మంత్రిగారు మాత్రం ఉపన్యాసం ఆపలేదు. విసిగిన జనం వెళ్ళిపోవడానికి ఉద్యుక్తు లవుతుండగా-

"నా ప్రియమైన ప్రజలారా! మీ ప్రియాతి ప్రియమైన చెప్పులను నాకు ఇచ్చి నా చెప్పుల కంపెనీ అభివృద్ధికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నా ఉపన్యాసం ముగిస్తున్నాను."

కొరిటేల మల్లికార్జునరావు [నంద్యాల]

సేద దీరవోయి...."


అలా ఆ పాట వింటున్నంతసేపూ నేను లేను... ఈ నా చుట్టూ ఉన్న ప్రపంచం లేదు... అసలు అంతా శూన్యం... ఆ పాట ఒక్కటే సత్యం... ఆ పాట ఒక్కటే నిత్యం అన్పించింది నాకు.

అవును... అంతులేని ఈ జీవన యానంలో ప్రతి ఒక్కరూ బాటసారులే. అలాంటి ప్రతి బాటసారీ ఒక నిముషం కాదు. ఒక యుగమైనా సేదదీరగల హాయైన పాట అది.

అలాంటి అదృష్టం నాకు కలిగింది. నేను నిజంగా చాల అదృష్టవంతుడ్ని.

రోజు రోజుకూ మెకానికల్‌గా... నిస్సార వంతంగా... జీవితం చాల రొటీన్‌గా గడుస్తున్న నా లాంటి వాడికి ఆ గానం... ఎడారిలో ఒయాసిస్సులాంటిది. బాట సారికి దొరికిన సత్రం లాంటిది. అసలు ప్రతి మనిషి రోజులో కాసే పయినా ఇలాంటి అనుభూతుల మధ్య గడవ గలిగే అవకాశం వస్తే అది ఎంత అదృష్టం.

కాని రోజు రోజుకూ పెరిపోతున్న తాపత్రయాల మధ్య... నశించిపోతున్న విలువల మధ్య... చీమల్లా... దోమల్లా... నల్లుల్లా.... బల్లుల్లా పరుగులు తీస్తున్న ఎంత మంది మనుష్యుల కీ అమృత గానం సోకేను?...




ఆలోచనల మధ్య ఎప్పుడో అస్తమించిన సూర్యుడ్ని నేను గమనించలేదు. నా చుట్టూ కమ్ముకుని... నన్ను కౌగలించుకున్న చీకట్లను తరిమి కొట్టే ప్రయత్నంగా లైటు వెలిగించాను.

ఒక కమ్మని పాట - కొన్నేళ్ళుగా నాలో పేరుకున్న నైరాశ్యాన్ని... స్తబ్దతను పోగొట్టినట్లుగా... ఒక చిన్న దీపం... ఆ గది నిండా పరచుకున్న చీకటిని! పారద్రోలింది.

ఆ రాత్రి నాకు భోజనం చెయ్యా లన్పించ లేదు.... నా కసలు ఆకలిగా ఉంటే కదా! ఆ పాటతో నాకు కడుపు నిండిపోయింది. మనిషికి ఆనందం వలన కలిగిన తృప్తి... కడుపు నిండా భోజనం చెయ్యడం వలన కూడా కలగదు.

ఆ రాత్రి నాకు కమ్మని కల-

సుగంధ పరిమళాలను వెదజల్లే పూల వనాల మధ్యగా గలగల పారే సెలయేరు... ఆ సెలయేట్లో పాదాలు మాత్రమే మునిగే నీళ్ళు.. ఆ కొద్ది పాటి నీటి ఒరవడికి.. కొద్ది కొద్దిగా ముందుకు కదిలే గులక రాళ్ళు.... గుంపులు గుంపులుగా తోక లూపుకుంటూ కిలకిల పరుగులు తీసే చిన్న చిన్న చేపలు. మనసును సేద దీర్చేంతటి చల్లనైన గాలికి అల్లన మెల్లన తలలూపే రెల్లుపూల గుత్తులు.. అలాంటి ప్రదేశంలో హద్దులు లేకుండా ఆకులో ఆకునై... కొమ్మలో కొమ్మనై... గాలిలో గంధమై... ఏటిలో నీటినై... కేరింతలు కొడుతూ విహరిస్తున్న నేను నన్ను ఆట పట్టిస్తూ కువకువలాడుతోన్న కోయిల.. - ...

కల చెదిరింది... ఎంత అందమైన కల... ఆ కలే శాశ్వతమైతే ఎంత బాగుణ్ను... కాసిన్ని మంచి నీళ్లు తాగి పడుకున్నాను. ఆ కలనే మళ్లీ నెమరు వేసుకుంటూ ఆకలిని కూడా మరచిపోయి.

ం ం ం ం

ఆ రోజు తొలి వెలుగు రేఖలకు జాగృతి కలిగిస్తూ ప్రతి రోజూ వినిపించే పాట ఆ 'కిటికీ' లోంచి వినిపించలేదు నాకు. ఏదో వెలితి... ఏదో కోల్పోయిన భావన. అనీజీనెస్. ఎదురు చూసీ... ఎదురు చూసీ అన్యమస్కంగానే ఆఫీసుకు వెళ్ళాను.

"ఏరా ప్రభాకర్... అలా ఉన్నావ్?" సన్నిహితులైన ఒక రిద్దరు హితుల పరామర్శ... గుండెను తడిమిన స్పర్శ. కానీ ఏం చెప్పను? నేను కొన్ని రోజులుగా పొందుతున్న అనంతమైన ఆనందాన్ని... ఈ రోజు పొందలేక పోవడం వలన అలా ఉన్నానని వాళ్లకు చెప్పడం నా కిష్టం లేదు.

"కాస్త ఒంట్లో బాగులేదురా" - అదీ వాళ్ళకు నా సమాధానం. మనసు బాగు లేనపుడు శరీరం మాత్రం ఏం బాగుంటుంది?.. ఆఫీసు వదిలే వరకూ ముళ్ళ మీద కూర్చునట్లే అనిపించింది నాకు. ఆఫీసు వర్క్ మీద ఏ మాత్రం మనసు లగ్నం చెయ్యలేక పోయాను. ఒకటే ఆలోచన నాకు.

ఆ రోజు ఉదయం ఆ అమృత గానం ఎందుకు వినిపించలేదు? జవాబు లేని ప్రశ్న... జవాబు దొరకని ప్రశ్న. జవాబు నాకెవరు చెబుతారు. మళ్లీ సాయంత్రం ఆ కిటికీయే చెప్పాలి. త్వరగా ఇంటికి పోయి. కనీసం మలి సంధ్యా గానా న్నయినా వినాలి నేను. అప్పటికి గాని స్వాంతన చేకూరదు నాకు.

ఆఫీసు వదిలిన వెంటనే ఆఘమేఘాల మీద ఇంటికి చేరుకున్నాను. నా గది తియ్యబోతూ ఆ 'కిటికీ' వేపు చూశాను ఏ అలికిడీ లేదక్కడ.

కిటికీ నుండి దృష్టి మరల్చి యథాలాపంగా క్రిందకు చూసిన నాకు ఆ ఇంటి ముందు విపరీతంగా గుమికూడిన జనం కనిపించారు.

"ఏం జరిగింది? అంత మంది జనం ఎందు కున్నారక్కడ?" ఎవరో కొంత మంది సన్నగా రోదిస్తున్న ధ్వని కూడా.

ఏం జరిగింది?!

అరుగు మీద నిలబడి అటే చూస్తున్న మా ఇంటి ఓనర్‌ని అడిగాను అదే మాట- "ఏం జరిగింది సార్! అక్కడ అంత మంది జనం గుమికూడా రెందుకని?"-

నా ప్రశ్నకు బదులివ్వకుండా నావేపు చూశాడాయన. ఆయన కళ్ళ నిండుగా దుమకడానికి సిద్ధంగా ఉన్న నీళ్ళు.

"సార్! ఈ వాళ ఉదయం 'కిటికీ' లోంచి ఆమె పాట వినిపించినట్లు లేదు కదూ?"

ఈసారి కూడా ఆయన నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు కాని... ఆయన కళ్ళ నుండి ధారాపాతంగా వర్షించిన కన్నీరు. గబగబా వచ్చి నా రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని బావురు మన్నాడాయన.

"ఇక... ఇక మనకా పాట వినిపించదు సార్. ఆ కోయిల ఇక లేదు సార్ లేదు... మన కందని దూరాలకు ఎగిరిపోయింది. తన పాట మనకు వినిపించని సుదూర తీరాలకు వెళ్ళి పోయింది సార్. ఒక కిరాతకు డా గాన కోకిలను తన పొట్టన పెట్టేసుకున్నాడు సార్. పొట్టన పెట్టేసుకున్నాడు. అదిగో అక్కడ నిర్జీవంగా పడి ఉందండీ.. ప్రతి ఉదయం... సాయంత్రం... తన అద్భుత గానంతో... గాలికి గంధాలు పొదిగిన అద్భుతమైన కంఠం.... "నా చేతుల్లో వాలిపోయి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నా డాయన.

మొద్దుబారి పోయింది నా మనస్సు. అతను చెప్పిన నిజం జీర్ణం చేసుకో లేక పోతున్నాను. అతను చెప్పిందంత నిజమా? భ్రాంతా?

అతడ్ని వదిలించుకుని ఒక్క ఉదుటన గుమికూడిన జనాల వేపు పరుగు తీశాను గుంపును ఛేదించుకుని లోపలికి చూసిన నాకు

చామన చాయతో, కళగా అందంగా!..ప్రశాంతంగా నిద్ర పోతున్నట్లుగా ఉన్న అమ్మాయి... లలిత లలిత రజనీకర పల్లవ...

"కుందనపు బొమ్మలాంటి పిల్ల.. పాటలు ఎంత చక్కగా పాడేదని కోయిల్లా... ముదనష్టపు మొగుడి వల్ల ఉరి పోసుకుని చచ్చింది" - ఎవరో అంటున్నారు.

ఆమె కంఠం వేపు చూశాను. రక్త నాళాలు ఉబ్బి... నల్లగా కమిలి...

ఆ గొంతు లోంచే కదూ - గానం రసగంగా ఝురీ

ప్రవాహమై పొంగేది..! ఆ గొంతులోంచే కదూ... అద్భుతమైన పాటలు జాలు వారి వీనుల విందుగా అలరించేవి!

ఆ కోయిల...ఉరి పోసుకుంది.

వికృతమైన మానవ వనంలో... భర్త అనే దౌర్భాగ్యపు చెట్టుకి ఉరి పోసుకుంది.

"ఆవిడ గొంతుకని అమ్ముకుని లక్షలు సంపాదించాలని చూసేవాడట"-

"అందుకాయమ్మ ఒప్పుకునేది కాదట. అందుకని అప్పుడప్పుడు కొట్టే వాడట కూడాను" -

"నన్ను చంపినా నా గొంతుకను అమ్ముకోడానికి ఒప్పుకోను అనే దటాయమ్మ"-

"ఆఖరికి నిన్ను చాలా బెదిరించి... కొట్టేశాడట. ఇవన్నీ వివరంగా రాసి ఉరేసుకుంది" -

ఎవరూ అడక్క పోయినా అమ్మలక్కలు చెప్పుకుంటున్నారు. గుప్పెట్లో దాచిన దాగని నిప్పులాంటి నిజాలు.

నా చెవి కింకేమీ సోకటం లేదు. నిద్రలో నడుస్తున్న వాడిలా నడుస్తూ నా గదిని చేరుకుని మంచంపై వాలిపోయాను. నా చూపులు శూన్యాన్ని వెతుకుతున్నాయి. నా కళ్ల ముందు... కోయిలను పట్టుకుని నిర్దాక్షిణ్యంగా గొంతు నులిమి చంపిన వేటగాడు మెదులుతున్నాడు

రేపటి నుండి ఆ కిటికీ లోంచి ఎవరి కమ్మని గొంతు వినిపిస్తుంది? అసలా కిటికీ వేపు చూడగలడా తను?!

అందమైన పూల తోటకు నిప్పు పెట్టేశారు. తేనెలూరే గానాన్ని గొంతును నిలిమేశారు.

టైమెంతయిందో తెలీదు. అయినా కళ్ళు విప్పలేదు వెలుగును చూడడం ఇష్టం లేక.

"మాష్టారూ"- మా ఇంటి ఓనర్ గొంతది.

"సార్! దయచేసి లైటార్పేసి నన్నిలా ఒంటరిగా వదిలేస్తారా" - కళ్ళు తెరవకుండానే అన్నాను.- "ప్లీజ్"-

లైటు ఆర్పేసి అతను వెళ్లి పోయిన ధ్వని.

నా గుండె దుఃఖంతో ఘనీభవించి పోయింది. నేనెప్పుడు బరస్ట్ అవుతానో నాకే తెలీని స్థితి. అందుకే నే నాతనితో మాట్లాడలేదు.

ఆ రాత్రి... ఎలా తెల్లవారిందో నాకు తెలీదు. నా గది కిటికీ కూడా తియ్యలేదు. నా కున్న కొద్దిపాటి సామాన్లు ఒక గోనె మూటలో సర్దేశాను.

"సార్! నా కున్న ఈ కొద్దిపాటి సామాన్ల మూటను అభ్యంతరం లేకపోతే కొన్నాళ్ళు మీ ఇంట్లో ఉంచుతారా?" అడిగాను.

"అదేవిఁటి! ఎక్కడకు వెళ్తున్నారు?"-

"ఇక్కడికి అని చెప్పలేను. అలా అని ఇక్కడ ఉండలేను. కొన్నాళ్ల పాటు అలా..."

"సరే.. మీ ఇష్టం"

"థాంక్స్" - మూట గది తాళాలు అప్పగించి బయట పడ్డాను. నా జీవితంలో నేను కోల్పోయిన పెన్నిధిని పొందా ననుకున్నా నిక్కడ. నా పరిధిలో ఓ అందమైన సుందర లోకాన్ని నిర్మించుకున్నాను. 'ఆమె' పాటతో నా జీవితాన్ని రాగరంజితం చేసుకున్నాను.

కాని.. కాని... అంతా క్షణికమై పోయింది. నా ఊహల పూల తోటల్లో విహరించే కోయిల ఇక లేదు. మరి రాదు. తన పాటని మిగిల్చి తను వెళ్ళి పోయింది తిరిగి రాని లోకాలకు.

రాతి గుండెలు కలిగిన ఈ మనుష్యుల మధ్య మనల లేక...

రస విహీనమైన ఈ జగత్తులో మనుగడ సాగించలేక... స్పందన లేని హృదయాలకు... అందని సుదూర తీరాలకు.... వెళ్ళి పోయింది.

నేనూ - ఇక అక్కడ ఉండలేను.

అందుకే నేనూ... అంతులేని దూరాలకు.... ఒంటరిగా.... బాటసారిలా....

కాని... ప్రతి క్షణం నా చెవుల్లో గింగురు మనే ఆ పాట నన్ను వెంటాడుతూనే ఉంటుంది.

నా ఊపిరిలో ఊపిరిలా....

నా ప్రాణంలో ప్రాణంలా.....

"అంతులేని పయనమేటు.... అలసి ఉన్న బాటసారి.....

ఆగి ఒక నిముషమిచట సేద దీరవోయీ......" ●



**ఇబ్బంది**

*విలేఖరి: మీకు సాంఘిక చిత్రాలంటే ఇష్టమా, లేక పౌరాణిక చిత్రాలంటే ఇష్టమా?*

*హీరో: సాంఘిక చిత్రాలే మేలు. షూటింగ్ అయిపోగానే అవే బట్టలతో ఇంటి కెళ్ళొచ్చు. పౌరాణికమైతే ఆ నగలు వేసుకొని వెళ్లాలంటే కొంచెం ఇబ్బందిగా ఉంటుంది.*

కొరిపేల మల్లికార్జునరావు [నంద్యాల]

ప్రపంచంలో ఎక్కడున్నా మనిషి ఒక్కడే!
అతడి ఆలోచనలూ, ప్రవృత్తులూ సమానమే!
కాసింత ప్రేమ, కొస్తంత అసూయ,
మరి కొంత మూర్ఖత్వం, ఇంకొంత అహంకారం,
ఇలా ఎన్నో "కొంత"లు కలిసి "ఇంత" మనిషి!

అలాటి మనిషిని భారతీయ భాషల్లోని మహా రచయితలూ, రచయిత్రులూ ఎలా దర్శించారు?

కథ అనే "ప్రిజమ్" నుండి వెలువడే మనిషి సప్త వర్ణ చిత్రాలను తెలుగులో అందిస్తున్న వారు డాక్టర్ దేవరాజు మహారాజు!

ఏ రంగు ఎవరిదో
వచ్చే వారం నుండీ
ఈ "హరివిల్లు"లో
వెతుక్కోండి!